

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



శిశువుల ఆరోగ్యానికి భరోసా

శిశువుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. 'అనంత'కు రెండు నియోనేటల్ అంబులెన్సులు ఏర్పాటు చేసింది. 8లో

గరిష్టం/కనిష్టం
41.2°/23.4°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

గుంతకల్లు-చిక్ జాజూర్ రైళ్లు నేటి నుంచి తాత్కాలికంగా రద్దు



రాయదుర్గంటౌన్: గుంతకల్లు – చిక్‌జాజూర్ స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 17 నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు సౌత్ వెస్టన్ రైల్వే హుబ్లి డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ జేపీ యోగేష్ తెలిపారు. బళ్లారి – రాయదుర్గం సెక్షన్ పరిధిలో సేఫ్టీ పనులు జరుగుతున్నందున ఈ నెల 17 నుంచి 28 వరకు 12 రోజులపాటు గుంతకల్లు – చిక్‌జాజూర్ స్పెషల్ ప్యాసింజర్ (07586), చిక్‌జాజూర్ – గుంతకల్లు స్పెషల్ ప్యాసింజర్ (07585) రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. 29 నుంచి రైళ్లు పునరుద్ధరిస్తామన్నారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

నేరాల నియంత్రణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. నేరాల తీవ్రతను బట్టి వాటిని పరిష్కరించే విషయంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పెండింగ్ కేసులు పరిష్కారానికి నోచుకోకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. హత్యలు, హత్యాయత్నాలు, దొమ్మీలు, దొంగతనాలు, దోపిడీలు, చైన్‌స్నాచింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. అవినీతికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి, జి.రామకృష్ణ, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

48 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నాటికి 54 వేల మంది రైతులకు 48 వేల క్వింటాళ్లు అందజేసినట్లు వ్యవసాయశాఖ జిల్లా అధికారి యు.ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకే వేదికగా విత్తన వేరుశనగ, కందులు, రాగులు, కొర్రలు, పచ్చిరొట్ట విత్తనాలకు రిజిస్ట్రేషన్లు, పంపిణీ కొనసాగుతోందన్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటిదాకా 65 వేల క్వింటాళ్ల వరకు ఆర్‌బీకేలకు విత్తనాలు సరఫరా చేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే.ధనలక్ష్మి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పరికరాల అందజేత



పరికరాలు అందజేస్తున్న కృష్ణవేణి

అనంతపురం క్రైం: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ ఇచ్చిన హామీ మేరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగానికి రూ.2లక్షలు విలువైన పరికరాలను శుక్రవారం ఆర్డీటీ ప్రొక్యూర్‌మెంట్ డైరెక్టర్ కృష్ణవేణి అందజేశారు. ఆర్డీటీ సేవలు మరువలేనివని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ హరీష్ పాల్గొన్నారు.

జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: జిల్లాలో ఈ నెల 18 నుంచి 21వ తేదీలోపు తేలికపాటి నుంచి మధ్యస్థ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 34.6–38.8, రాత్రి ఉష్ణోగ్రతలు 24.2–26.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 65–81, మధ్యాహ్నం 32–58గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

సౌర వెలుగులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,400 మెగావాట్ల సోలార్ విద్యుత్ తయారీ కేంద్రంగా ఎన్‌పీకుంట (నంబులపూలకుంట) అవతరించనుంది. ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. దీంతో బడా కంపెనీలు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నాయి.



- అనువైన ప్రాంతంగా ఎన్‌పీకుంట
- సుమారు 9వేల ఎకరాల్లో వివిధ కంపెనీల ప్రాజెక్టులు
- పెట్టుబడులు పెట్టేందుకు బడా కంపెనీలు రెడీ
- మొన్నటివరకూ సాధారణ మండల కేంద్రం
- ఇప్పుడు గూగుల్‌లో ఎన్‌పీ కుంట అనగానే సోలార్ వివరాలు ప్రత్యక్షం
- 1,400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కేరాఫ్‌గా నిలుస్తున్న వైనం
- మరో 3వేల మెగావాట్లతో త్వరలోనే కళ్యాణదుర్గంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు



ఎన్‌పీకుంటలోని పవర్ గ్రిడ్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నిన్న, మొన్నటి వరకూ ఆ ఊరు పేరు చాలామందికి తెలియదు. అన్ని మండలాల మాదిరే అదీ ఒక సాదాసీదా ప్రాంతం. మెట్ట పైర్లు వేసుకుంటూ జీవనం సాగించే రైతులు.. వారితో పాటే రైతు కూలీలు నివసించేవారు. ప్రతి ఊరికీ ఒక రోజు వస్తుందన్నట్టు ఇప్పుడు ఈ ఊరు రాష్ట్రంలోనే ఒక పేరుమోసిన పవర్ హబ్‌గా మారింది. కదిరి నియోజకవర్గంలో ఉండే ప్రాంతమే నంబులపూలకుంట. ఎన్‌పీ కుంటగా పిలుచుకునే ఈ మండల కేంద్రం ఇప్పుడు ఏపీలో సోలార్ పవర్‌హబ్‌గా మారింది. గూగుల్‌లోనూ ఈ ఊరికి చోటు దక్కింది.

క్యూ కడుతున్న బడా కంపెనీలు

దేశంలో పేరుమోసిన బడా కంపెనీలు ఇక్కడ సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేశాయి. మరి కొన్ని కంపెనీలు సైతం ఇక్కడకు వస్తున్నాయి. ఇప్పటికే ఆరేడు కంపెనీలు పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయగా, మరో కొత్త కంపెనీ (హెచ్‌పీసీఎల్) త్వరలోనే తమ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి సిద్ధం చేసింది. ఎన్‌పీ కుంట కేంద్రంగా 1,400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కానున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వానికే కరెంటు

ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న కరెంటును రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఒక్కో యూనిట్ రూ.2.70కు కొనుగోలు చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. ప్రభుత్వమే ఆయా కంపెనీలకు భూములు తక్కువ ధరకు ఇచ్చింది కాబట్టి ఉత్పత్తి అయిన కరెంటును ప్రభుత్వానికే ఇచ్చేలా ఒప్పందం జరిగింది. త్వరలోనే కళ్యాణదుర్గంలోనూ 3వేల మెగావాట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

ఎన్‌పీకుంటలో సోలార్ ప్లాంట్ పెట్టిన కంపెనీలు	సామర్థ్యం (మెగావాట్లలో)
ఎన్‌టీపీసీ	250
ఆయానా	250
స్ప్రింగ్ పవర్	250
సాఫ్ట్‌బ్యాంక్	250
టాటా పవర్	100
ఆక్‌మీ	150
హెచ్‌పీసీఎల్ (కొత్తగా)	100

పరిశ్రమల రాకతో భూములకు రెక్కలు

అప్పటివరకూ నంబులపూలకుంట అంటే ఎవరికీ పెద్దగా తెలియదు. వర్షాధార పంటలతో బతికే సన్న, చిన్నకారు రైతులు, రైతు కూలీలకు మాత్రమే ఆ ఊరు పరిమితం. పెద్ద పెద్ద సోలార్ పరిశ్రమల రాకతో ఈ ప్రాంతంలో భూములకు రెక్కలొచ్చాయి. గతంలో రూ.5 లక్షలున్న ఎకరా ఇప్పుడు రూ.20 లక్షల ధర పలుకుతోంది. పవర్ ప్లాంట్లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఈ ప్రాంతంలో గతంతో పోల్చితే ఇప్పుడు రోడ్డు రవాణా సౌకర్యం మరింత మెరుగైంది.



అత్యంత అనుకూల పరిస్థితులున్నాయి

కదిరి నియోజకవర్గం ఎన్‌పీ కుంటలో పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులున్నాయి. దీనికి తోడు ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం కూడా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహాలందిస్తోంది. దీంతో ఎక్కువమంది ఇక్కడ పవర్‌ప్లాంట్ల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నారు. – శివశంకర్ నాయుడు, డీఈ, సోలార్ పవర్ కార్పొరేషన్

సమస్యలు పరిష్కరిస్తాం



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: చాగల్లు ప్రాజెక్ట్ దిగువన పెద్దయక్కలూరు ఎస్సీ కాలనీలో నీటి ఊట కారణంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ గౌతమి అన్నారు. ఇటీవల సంక్షేమ పాదయాత్రలో భాగంగా తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తన దృష్టికి వచ్చిన కాలనీవాసులు తెలిపిన సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. నీటి ఊట వల్ల నివాసాల సమీపంలో విషపురుగులు సంచరించడంతో పాటు విషజ్వరాలు ప్రబలుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. తమకు ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, నీటి పారుదల, రెవెన్యూ, వ్యవసాయ, విద్య, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో పాటు మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎంఈజీపీ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్: ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా (పీఎంఈజీపీ) పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి జిల్లా సహాయ సంచాలకులు డి.విజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉత్పత్తి, సేవారంగ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న యువ పారిశ్రామిక వేత్తలు పీఎంఈజీపీ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రాజెక్టు మొత్తంలో 15 నుంచి 35 శాతం వరకు రాయితీలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలను నెలకొల్పే యువతకు నేరుగా బ్యాంకులతో రుణ సదుపాయాన్ని సైతం కల్పించనున్నట్లు వెల్లడించారు. www.kviconline.gov.in వెబ్ సైట్‌లో సంప్రదించి నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 94408 14612 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట





విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్ అందజేసి సన్మానిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, హాజరైన విద్యార్థులు

- విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి
- 14 ఏళ్లలో చంద్రబాబుకు ఏనాడూ పేదల చదువు గుర్తురాలేదు
- 'ఆణిముత్యాలు' అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుతో పాటు విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో శుక్రవారం నియోజకవర్గస్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' పథకానికి ఎంపికైన విద్యార్థులకు అవార్డుల ప్రదానం, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కుందుర్పి మండలం తెనగల్లు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని కరణం రక్షిత (587/600)కు రూ.15వేలు కళ్యాణదుర్గం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి కురబ కార్తీక్ (579/600)కు రూ.10 వేలు, బ్రహ్మసముద్రం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ విద్యార్థిని బోయ నిర్మల (576/600)కు రూ.5 వేల చొప్పున నగదుతో పాటు మెడల్, ప్రశంసాపత్రాలను మంత్రి ఉషశ్రీచరణ్, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేసి, శాలువాతో సత్కరించారు. ఇంటర్మీడియెట్‌లో కుందుర్పి విద్యార్థులు కె.మైత్రి, కె.హరీష్ బాబు, శెట్టూరు మోడల్ కాలేజీ విద్యార్థిని పాటిల్ ఇందు, బ్రహ్మసముద్రం సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థిని ఎం.కీర్తి శ్రీలకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. 'అమ్మ ఒడి' పథకంతో బాల కార్మికుల సంఖ్య తగ్గి.. బాలలు బడిబాట పట్టారన్నారు. నాడు – నేడు పథకం కింద ప్రభుత్వ బడులను అన్ని హంగులతో తీర్చిదిద్దారన్నారు. జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలతో పేదలు ఉన్నత చదువులు చదివే అవకాశం కల్పించారని చెప్పారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. టీడీపీ హయాంలో ఉపాధ్యాయ ఖాళీలు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో దాదాపు 130 ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్కడా ఖాళీ అనేది లేకుండా భర్తీ చేశామని చెప్పారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు పేదల చదువుల గురించి ఏనాడూ గుర్తుకు రాలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పులిహోరా మేనిఫెస్టో తీసుకొచ్చారని విమర్శించారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రధాన హామీ అయిన మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, బీజేపీ హామీల్లో ఒకటైన ఏడాదికి మూడు సిలిండర్లు, ఏపీలో అమలవుతున్న అమ్మ ఒడి పథకం తరహాలో 'అమ్మకు వందనం' వంటి పథకాలతో టీడీపీ మేనిఫెస్టోను రూపొందించారని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, మార్కెట్ డైరెక్టర్ బ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్ అర్చన, సీనియర్ నాయకులు సుధీర్, ఆంజనేయులు, నాగలక్ష్మి, రామచంద్ర, షేక్షావలి, పెరుగు తిమ్మరాజు, భీమేష్, అఫ్జల్‌తో పాటు ఐదు మండలాల ఎంఈఓలు, సర్పంచులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి 8,327 దరఖాస్తులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం జూలై 17న నిర్వహించనున్నారు. స్నాతకోత్సవ నిర్వహణ ఏర్పాట్లలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. ఏపీ గవర్నర్, యూనివర్సిటీ చాన్స్లర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. గవర్నర్ హాజరవుతారని ఇప్పటికే వర్సిటీ ఉన్నతాధికారులకు అధికారికంగా సమాచారం అందినట్లు తెలిసింది. స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం అయ్యారు. 2021–22 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఈ స్నాతకోత్సవానికి మొత్తం 8,327 దరఖాస్తులు అందాయి. గత స్నాతకోత్సవంతో పోలిస్తే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. 68 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు గాను 61 మంది నేరుగా గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు అందుకోనున్నారు. గౌరవ డాక్టరేట్‌కు సంబంధించి గవర్నర్ ఆమోదం పొందిన తరువాత ప్రకటించనున్నారు.

విస్తృతంగా చిరుధాన్యాల సాగు



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య, చిత్రంలో అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, జేసీ కేతన్‌గార్గ్

- అధికారులకు ఎంపీ రంగయ్య సూచన

అనంతపురం అర్బన్: జిల్లాలో చిరుధాన్యాల పంటల సాగు విస్తృతంగా చేపట్టాలని ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు చిరుధాన్యాల సాగు, పంట కొనుగోలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, జేసీ కేతన్‌గార్గ్ అధ్యక్షతన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీ రంగయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ప్రభుత్వం ఏ విధంగా ప్రోత్సహిస్తోందనే విషయాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాగులో కూలీల ఖర్చు తగ్గించేందుకు ఉన్న మార్గాలను వివరించాలని సూచించారు. చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాల పంపిణీ సక్రమంగా సాగాలన్నారు. రైతులకు మినీ ట్రాక్టర్, పనిముట్లను రాయితీపై ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జొన్న, రాగి, కొర్ర విత్తనాలను రైతులకు రాయితీపై ఇస్తామన్నారు. వేరుశనగ పంట తరచూ నష్టపోతున్న కారణంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇస్తామన్నారు. ఈ ప్రక్రియకు కౌలుకిచ్చిన భూ యజమానులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ- స్టాంపులతో అక్రమాలకు చెక్



ఈ స్టాంపును అందజేస్తున్న డీఐజీ మాధవి, చిత్రంలో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం


అనంతపురం టౌన్: ఈ– స్టాంపింగ్ విధానంతో అక్రమాలకు తావుండదని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ – స్టాంపుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించి వినియోగదారులకు ఈ స్టాంపులను అందజేశారు. డీఐజీ మాట్లాడుతూ మ్యానువల్ విధానంలో స్టాంప్ వెండర్లతో స్టాంపులను కొనుగోలు చేసి పాత తేదీలతో విక్రయ అగ్రిమెంట్లు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడేవారన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఈ స్టాంపింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీంతో ఏ తేదీన స్టాంపులు కొనుగోలు చేస్తారో అదే తేదీతో స్టాంపులను అందజేస్తారన్నారు. ఈ విధానం పూర్తి పారదర్శకంగా ఉంటుందన్నారు. వినియోగదారులు సైతం ఈ స్టాంపింగ్ విధానంలోనే స్టాంపులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా వాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా ఈ– స్టాంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో మ్యానువల్ స్టాంపుల మనుగడ ఉండదన్నారు. ప్రస్తుతం జిల్లాలో స్టాంప్ వెండర్లుగా కొనసాగుతున్న వారు సైతం ఈ స్టాంపింగ్ వెండర్లుగా అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ రికార్డులతోపాటు రికార్డు డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. వినియోగదారులకు సకాలంలో రిజిస్ట్రేషన్ సేవలను అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం, సబ్ రిజిస్ట్రార్లు సత్యనారాయణమూర్తి, టీజీ రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇన్సూరెన్స్ విడుదల

- 3,810 మంది రైతులకు రూ.38.12 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ –2021కు సంబంధించి వివిధ కారణాలతో ఇంకా పెండింగ్‌లో ఉన్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు మునుపెన్నడూ లేని విధంగా 4 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.855 కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా 15.61 లక్షల మంది రైతులకు 2,977 కోట్ల బీమా పరిహారాన్ని 'అనంత' వేదికగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదివరకే బటన్ నొక్కి విడుదల చేశారు. ఇటు వ్యవసాయ, అటు ఉద్యాన రైతులకు పరిహారం ఇచ్చారు. అయితే అందులో వివిధ కారణాలతో కొందరు రైతులకు పరిహారం జమ కాలేదు. వారందరి వివరాలు, ఖాతాలు మరోసారి పరిశీలించిన తర్వాత తాజాగా పరిహారాన్ని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అలా అనంతపురం జిల్లా పరిధిలో 3,810 మంది రైతులకు రూ.38.12 కోట్లు పెండింగ్ బీమా విడుదల చేసినట్లు తెలిపారు. నెలాఖరులోపు రైతులందరికీ పరిహారం జమయ్యే అవకాశం ఉందన్నారు.

టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి శుక్రవారం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం 4.940 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 40.450 టీఎంసీల నీరు నిల్వ ఉండి, 454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేది. డ్యాంలో ప్రస్తుతం 1580.94 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. శుక్రవారం ఇన్‌ఫ్లో 0 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరులేక కళ తప్పింది.

క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



చంద్రమోహన్ (ఫైల్)

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో చంద్రమోహన్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. యథావిధిగా శుక్రవారం ఉదయం ఉరవకొండ నుంచి పాల్తూరుకు ద్విచక్ర వాహనంపై విధులకు బయలు దేరారు. అయితే ఉండబండ గ్రామం వద్ద పాల్తూరు గ్రామం వైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనం.. కానిస్టేబుల్ చంద్రమోహన్ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలలో రక్తం గడ్డ కట్టడంతో వెంటనే వైద్యులు ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వేణుగోపాల్‌నగర్‌కు చెందిన రామాంజినేయులు (45) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నారు. కాగా రామాంజినేయులు మృతికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. బాధిత కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోపణలపై ఆర్జేడీ బృందం విచారణ



ఎస్‌డీజీఎస్ కళాశాలలో బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఒకప్పటి ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్జేడీ బృందం శుక్రవారం విచారణ చేపట్టింది. కళాశాలలో యూజీసీ, స్థానిక కళాశాల నిధుల దుర్వినియోగం, మహిళా లెక్చరర్లను వేధించడం తదితర ఫిర్యాదులు ఒకప్పటి ప్రిన్సిపాల్ శ్రీనివాసులుపై వచ్చాయి. కళాశాల యాజమాన్యం అప్పట్లోనే ప్రిన్సిపాల్ శ్రీనివాసులును సస్పెండ్ చేసింది. గతంలో ఓసారి ఆర్జేడీ ఆదేశాలతో విచారణ చేపట్టారు. మరోసారి శుక్రవారం విచారణ బృందం కళాశాలకు వచ్చి విచారణ చేసింది. ఇప్పటికే పలుమార్లు విచారణ చేసినా ఎందుకు ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడం లేదని, విచారణ పేరుతో కాలయాపన చేయకుండా ఇప్పటికైనా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలలో ధర్నా చేశారు.

శిశువుల ఆరోగ్యానికి భరోసా

- నవజాత శిశువుల కోసం రెండు అంబులెన్స్‌ల ఏర్పాటు
- ఆధునిక సౌకర్యాలతో ఊపిరి పోస్తున్న సిబ్బంది
- సురక్షితంగా ఆస్పత్రులకు 3,978 మంది తరలింపు

నవజాత శిశువుల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. నియోనేటల్ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌లు అత్యవసర వేళ అపర సంజీవనిలా పనిచేస్తున్నాయి. అనారోగ్యంతో ఉన్న పసికందును ఆగమేఘాలపై ఆస్పత్రికి చేరుస్తూ ప్రాణాపాయం నుంచి తప్పిస్తున్నాయి.



నియోనేటల్ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్స్



ఇక్కడ అంబులెన్స్‌లోని ఇంక్యుబేటర్‌లో కనిపిస్తున్న శిశువు రాయదుర్గానికి చెందిన లలిత కూతురు. శిశువుకు సర్జరీ చేయాలని అనంతపురం ప్రభుత్వాస్పత్రి వైద్యులు సూచించారు. అనంతపురంలో చిన్నపిల్లల సర్జన్ లేకపోవడంతో పాపను కర్నూలుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో నియోనేటల్ అంబులెన్స్‌లో ఈఎంటీ కవిత పాపకు సేవలందించి కర్నూలు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు.

అనంతపురం క్రైం: నవజాత శిశువులను సకాలంలో ఆస్పత్రులకు తరలించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 108 నియోనేటల్ అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్స్‌లు సత్ఫలితాలిస్తున్నాయి. క్షతగాత్రులు, ఆపద సమయంలో ఉన్న వారికి తక్షణ వైద్యం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్తగా అధునాతన సౌకర్యాలతో 108 అంబులెన్స్‌లను అందుబాటులో తీసుకువచ్చిన విషయం తెలిసిందే. వీటితో పాటు వివిధ రకాల సమస్యలతో ఇబ్బందిపడుతున్న పసికందులను ఆస్పత్రులకు చేర్చేందుకు అనంతపురం, కళ్యాణదుర్గం పరిధిలో రెండు నియోనేటల్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు.

2020 నుంచే సేవలు

2020 జూలై నుంచి నియోనేటల్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి ఈ ఏడాది మే వరకు 3,978 మంది పసికందులను సురక్షితంగా ఆస్పత్రులకు చేర్చడంలో ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో 108 మేనేజర్, పైలట్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు కీలకపాత్ర పోషించారు. కళ్యాణదుర్గం నుంచి 2474, అనంతపురం నుంచి 1504 మంది పసికందులను ఆస్పత్రులకు తరలించారు.

అన్ని సౌకర్యాలతో..

తల్లులకు గర్భశోకం కల్గకుండా ఉండేందుకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోనేటాల్ అంబులెన్స్‌లను ప్రవేశపెట్టింది. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి పరిధిలో నెల రోజుల పురిటి పిల్లలకు వైద్యులు ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఒకవేళ అవసరమైతే వైద్యం కోసం ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు తెలియజేసి అంబులెన్స్‌లో పంపుతారు. నియోనేటల్ అంబులెన్స్‌లో రూ. లక్షలు విలువ చేసే ఇంక్యుబేటర్ (పసికందులకు కావాల్సిన ఉష్ణోగ్రత అందించే పరికరం), ఆక్సిజన్ అందించే ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్, సిరంజి పంపు (అత్యవసర సమయంలో అవసరమయ్యే మందు నిర్దేశిత సమయంలో ఇవ్వటానికి), వాల్యూమ్ ఇన్‌ఫ్యూజన్ పంపు (ఫ్లూయిడ్స్ ఇచ్చేందుకు), పల్స్ ఆక్సీమీటర్, తదితర అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ప్రైవేటు అంబులెన్స్‌ల్లోనూ ఇంతటి అత్యాధునిక సదుపాయాలు ఎక్కడా కన్పించవు. ఒకవేళ ప్రైవేట్‌గా ఇలాంటి అంబులెన్స్‌లు తీసుకుని వెళ్లాలన్నా రూ.10,000 నుంచి రూ.12,000 వరకు వసూలు చేస్తారు. అలాంటిది కార్పొరేట్ సౌలభ్యాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తోంది.

సేవలు సద్వినియోగం చేసుకోండి



ఉమ్మడి అనంతపురం జిల్లాలో మండలానికో అంబులెన్స్ కవరయ్యేలా 64 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. వాటితో పాటు 0 నుంచి 28 రోజుల పురిటి పిల్లల కోసం మరో రెండు నియోనేటల్ అంబులెన్స్ సర్వీసులందిస్తున్నాం. పురిటి పిల్లలకు ఏమైనా సమస్యలొస్తే 108కు కాల్ చేయాలి. సకాలంలో నియోనేటల్ అంబులెన్స్‌ను పంపి ఆస్పత్రులకు చేర్చేలా చర్యలు తీసుకుంటాం. శిశువుల తల్లిదండ్రులు అంబులెన్స్‌ల సద్వినియోగం చేసుకోండి.

– సంజీవరెడ్డి , 108 మేనేజర్

సరిహద్దులు పక్కాగా ఉండాలి

- సెంట్రల్ యూనివర్సిటీ భూములను మరోసారి సర్వే చేయాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ భూములకు సంబంధించిన సరిహద్దులను మరోసారి సర్వే చేసి హద్దులను పక్కాగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూమిని కలెక్టర్ పరిశీలించారు. ముందుగా యూనివర్సిటీకి ఎన్ని ఎకరాల భూమిని కేటాయించారు? సరిహద్దు గ్రామాల వివరాలేంటి? అన్న వివరాలను తెలుసుకున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీ భూముల హద్దులకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గతంలో సర్వే సరిగా చేపట్టలేదని రెవెన్యూ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ హద్దులను మరోసారి పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ భవణ నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. మొదటి విడతలో సెంట్రల్ యూనివర్సిటీ భూమిలో వసతి గృహాలు, అకడమిక్ బిల్డింగ్, ఎస్టేట్ ఆఫీస్, తదితర నిర్మాణాలకు సంబంధించిన వివరాలను సీపీడబ్ల్యూడీ ఈఈ శ్రీనివాసులు కలెక్టర్‌కు వివరించారు. యూనివర్సిటీని 491.30 ఎకరాల్లో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అయితే సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో ఉపాధి హామి పథకం పనులు చేపట్టకూడదని అధికారులను ఆదేశించారు. భూమికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదికలను తనకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, సెంట్రల్ యూనివర్సిటీ డీన్ ఇన్‌చార్జి రామిరెడ్డి, ప్రొఫెసర్ హనుమాన్ కెనడీ, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయ భాస్కర్, సర్వేయర్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడి

తనకల్లు: మండల పరిధిలోని రాకుంటపల్లి సమీపంలో శుక్రవారం ఇద్దరు రైతులపై దుండగులు దాడి చేసి గాయపరిచారు. బాధితుల వివరాలమేరకు.. రాకుంటపల్లికి చెందిన శ్రీనివాసులు, ఆదినారాయణ అన్నమయ్య జిల్లా బీ. కొత్తకోటకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. అయితే రాకుంటపల్లి దగ్గరకు రాగానే రోడ్డు పక్కనే ఉన్న మామిడితోటలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఉండటంతో వారిని ప్రశ్నించారు. దీంతో ఆగంతుకులు ఒక్కసారిగా రైతులపై దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాసులు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం అతన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాంధీజీ కన్న కలలు ఏపీలో సాకారం



ఎమ్మెల్యేల సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

- జాతీయస్థాయి ఎమ్మెల్యేల సదస్సులో ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం: మహాత్మ గాంధీ కన్న గ్రామ స్వరాజ్యం కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏపీలో సంపూర్ణంగా సాకరం చేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ముంబాయిలో జరుగుతున్న దేశవ్యాప్త ఎమ్మెల్యేలు, ఎంపీలు, చట్టసభల అధ్యక్షులు, రాజనీతిజ్ఞుల సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, నాడు–నేడు ద్వారా జరుగుతున్న మంచి వివరించారు. భారత రాజ్యాంగ కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కట్టుబడే సీఎం జగన్ ఆదర్శ పాలన సాగిస్తున్నారని కొనియాడారు.

వైఎస్సార్ చలువతోనే ఎమ్మెల్యే అయ్యా..

రాజకీయాల్లోకి రాకముందు పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ.. సొంత ఖర్చులతో ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని ప్రభుత్వ విప్ కాపు జాతీయ సదస్సులో గుర్తుచేశారు. ఆ సమయంలోనే మహానేత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందే అదృష్టం దక్కిందన్నారు. ఆయన అకాల మరణం తర్వాత సీఎం జగన్ వెంట నడిచి ఆయన నేతృత్వంలో పనిచేస్తుండడంతో సంతోషంగా ఉందన్నారు. ఏపీ ఎమ్మెల్యేలు అంటేనే దేశంలోనే అరుదైన గౌరవం దక్కేలా సీఎం జగన్ తీర్చిదిద్దారన్నారు. నాలుగేళ్లకే ఇలా ఉంటే 40 ఏళ్ల పాటు ఏపీకి జగన్ సీఎంగా ఉంటే దేశంలోనే ఏపీ రోల్‌మోడల్‌గా నిలవడం ఖాయమన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.65 వేలు స్వాహా



బాధితుడు గోపాలకృష్ణ

గుత్తి: రైల్వే విశ్రాంతి ఉద్యోగి గోపాల్ కృష్ణ ఏటీఎం కార్డును మార్చి ఓ ఆగంతకుడు ఏకంగా రూ. 65 వేలు స్వాహా చేసిన ఘటన గుత్తిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి వివరాలమేరకు... గుత్తి ఆర్‌ఎస్‌లోని బండి మోటు వీధిలో నివాసముండే రైల్వే విశ్రాంతి ఉద్యోగి గోపాల్ కృష్ణ ఈ నెల 14న డబ్బు డ్రా చేయడానికి గుత్తిలోని కెనరా బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో జనాలు అధికంగా ఉండటంతో అక్కడే ఉన్న ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లాడు. ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేస్తున్న సమయంలో ఓ ఆగంతకుడు నీకు డబ్బులు డ్రా చేయడం తెలియదని, తాను డ్రా చేసిస్తానని నమ్మ బలికాడు. దీంతో గోపాల్ కృష్ణ తన ఏటీఎంను ఆ ఆగంతకుని ఇచ్చాడు. అతను డబ్బులు డ్రా చేస్తున్నట్లు నటించి ఒరిజినల్ ఏటీఎం కాజేసి అచ్చం అలాగే ఉన్న ఏటీఎంను తిరిగి ఇచ్చాడు. అయితే అప్పుడు గోపాల్ కృష్ణ గమనించలేదు. అదే రోజు రాత్రి రూ. 65 వేలు డ్రా చేసినట్లు సెల్‌కు మెసేజ్ వచ్చింది. అవాక్కై ఆరా తీయగా తాను మోసపోయాయని గ్రహించాడు. దీంతో శుక్రవారం బాధితుడు గోపాల్ కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నీరుగంటి వీధికి చెందిన విద్యార్థి విష్ణుసాయి (15) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు... శివకుమార్ అనే వ్యక్తికి విష్ణుసాయితో పాటు కుమార్తె ఉన్నారు. చిన్న అంగడి పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమారుడు విష్ణుసాయి నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. అయితే శుక్రవారం ఇంట్లో కరెంటు సమస్యరావడంతో సొంతంగా సరిదిద్దాలని ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలోనే విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే విష్ణుసాయి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు కళ్ల ముందే విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచి వేసింది.

చదివింది ఎంబీఏ.. చేసేది దొంగతనాలు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలో చైన్ స్నాచింగులకు పాల్పడిన దొంగను అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ. 3 లక్షల విలువ చేసే 5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాలమేరకు... రాయపాటి అశోక్‌కుమార్ అలియాస్ అశోక్ అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని పాపంపేటలో నివాసం ఉంటున్నాడు. ఇతను ఎంబీఏ దాకా చదువుకున్నాడు. తల్లిదండ్రులతో పాటు కళ్యాణదుర్గం రోడ్డులో షాపు బాడుగకు తీసుకొని అందులో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న అశోక్.. దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నాడు. ఒంటరిగా సంచరించే మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న బంగారు చైన్‌లను దొంగతనం చేయాలనుకున్నాడు. స్థానిక బళ్లారి బైపాస్, ఓ ఫంక్షన్ హాల్ దగ్గర, హౌసింగ్ బోర్డ్ ఎల్ఐజీ కాలనీ, పాతూరు, వాసవీ బాలికల వసతి గృహం వద్ద, శ్రీనివాసనగర్‌లోని బాలాజీ కళ్యాణ మండపం వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్లి ఆడవారి మెడలోని బంగారు చైన్‌లను లాక్కొని పరారయ్యాడు. ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు త్రీటౌన్ పోలీసుస్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులుకు వచ్చిన సమాచారం మేరకు స్థానిక శాంతినగర్ బోర్డు సర్కిల్ వద్ద అశోక్‌ను అరెస్టు చేశారు. దీంతో సీఐ కత్తి శ్రీనివాసులు, ఎస్ఐ వలిబాషా, సిబ్బంది శివయ్య, శ్రీధర్, రాజశేఖర్, రంజిత్, చంద్ర, స్వరూప్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

సమస్యలపై స్పందించిన ఎస్పీ : పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ఎస్పీకి 25 వినతులు అందజేశారు. వారితో ముఖాముఖీ మాట్లాడిన ఎస్పీ.. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎ.హనుమంతు, ఎస్పీ సీఐ ఇందిర, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీ

సోమందేపల్లి: మండలంలోని రూకలపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం దారి దోపిడీ జరిగింది. బాధితుడి వివరాలమేరకు.. బోయ నరసింహప్ప పరిగి మండలం గొల్లపల్లి నుంచి తన స్వగ్రామమైన రూకలపల్లికు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. అయితే రూకలపల్లి సమీపంలోకి రాగానే ఇద్దరు దుండగులు వాహనాన్ని ఆపి నరసింహప్పపై దాడి చేశారు. సెల్‌ఫోన్‌తో పాటు రూ.1000 నగదు బలవంతంగా లాక్కొని పరారయ్యారు. అయితే దాడి దోపిడీపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో కూలీలకు గాయాలు



గాయపడిన వెంకటమ్మ

తాడిపత్రి: తేనెటీగల దాడిలో ఐదుగురు ఉపాధి హామీ కూలీలు గాయపడిన సంఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు ఉపాధి హామీ కూలీలు ఉదయం గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేపట్టారు. పనులు చేస్తున్న సమయంలో సమీపంలోని తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేశాయి. వాటి బారి నుంచి బయటపడే క్రమంలో కూలీలు పరుగులు తీశారు. కొందరిపై తేనెటీగలు దాడి చేయడంతో వెంకటమ్మ, బాల హనుమంతు, సునిత, సావిత్రి, నాగ లక్ష్మమ్మలు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటమ్మకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురంకు తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన రమేష్

గుత్తి: రైలు నుంచి కింద పడటంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప వివరాలమేరకు... చిత్తూరు జిల్లా మొలకలచెరువు మండలం కుమ్మరవానిపల్లికి చెందిన రమేష్ తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. అయితే గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలో డోర్‌లో నిలుచుని ఉన్న రమేష్ ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డాడు. రెండు కాళ్లు రైలు కింద పడటంతో నుజ్జునుజ్జు అయ్యాయి. జీఆర్‌పీ పోలీసులు అతన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. రమేష్‌ను ఇద్దరు వ్యక్తులు రైల్లో నుంచి తోసేశారని మొదట ప్రచారం జరిగింది. అయితే తనను ఎవరూ తోసేయలేదని, ప్రమాదవశాత్తూ జారిపడినట్లు రమేష్ పోలీసులకు తెలిపారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి తన భార్య లతతో శుక్రవారం గొడవపడి కత్తితో పొడిచాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాష్ మూడేళ్ల క్రితం లతను పెళ్లిచేసుకొన్నాడు. ఏడాదిగా అల్లరిగా తిరుగుతూ భార్యను నిర్లక్ష్యం చేసేవాడు. శుక్రవారం రాత్రి భర్తతో లత గొడవపడగా.. క్షణికావేశంతో ప్రకాష్ భార్య కడుపు, మెడపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన లతను చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం



షేక్ హమ్రూన్ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఎంబీఏ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్ఐ ధరణీబాబు వివరాల మేరకు.. పట్టణంలోని కాల్వగడ్డ వీధికి చెందిన షేక్ హమ్రూన్ ఎంబీఏ చదువుతోంది. ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఆమె తల్లి షేక్ నూర్జహాన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిని చంపిన కేసులో కుమారుడి అరెస్ట్

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో తల్లిని చంపిన కేసులో కుమారుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ రెండురోజుల క్రితం కల్లూరుకు చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి కుటుంబ కలహాలతో తండ్రి శ్రీనివాసులుపై కొడవలితో దాడిచేయగా తల్లి లక్ష్మీదేవి అడ్డు చెప్పే ప్రయత్నం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కొడవలి లక్ష్మీదేవికి తగిలి గాయం కావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి భర్త శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు రామ్మూర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు నరేష్

చెన్నేకొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు పట్టణానికి చెందిన నరేష్ (32) బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్నారు. అయితే ఎన్.ఎస్. గేట్ ఫ్లై ఓవర్ పైకి రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఫ్లై ఓవర్ గోడను బలంగా ఢీ కొన్నాడు. ఈ ఘటనలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుల అరెస్ట్

తలుపుల: మండలంలోని పాలిమేర గంగమ్మ, జ్యోతివాండ్లపల్లి తండాలోని మారెమ్మ విగ్రహాల ధ్వంసం కేసుల్లో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సీఐ శివశంకరనాయక్, ఎస్ఐ మగ్బూల్‌బాషా వివరాలమేరకు... విగ్రహాల ధ్వంసం కేసులో ఆవుల మల్లికార్జున , సాకే శాంబ, పూల రమేష్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారంతా ఆలయాల్లో చోరీలకు పాల్పడేవారన్నారు. అయితే డబ్బులు దొరకని పక్షంలో ఆలయాలు, విగ్రహాలను ధ్వంసం చేసేవారని తెలిపారు. డీఎస్పీ శ్రీలత ఆదేశాలతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఆవుల మల్లికార్జునపై అమలాపురం, తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసులు ఉన్నాయన్నారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ధర్మవరం: పట్టణంలోని రేగాటిపల్లి రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు కింద పడి మృతి చెందినట్లు హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు లుంగీ, షర్ట్ ధరించి ఉన్నాడని, షర్ట్‌పైన ధర్మవరం శివ టైలర్స్ లేబుల్ ఉందన్నారు. ధర్మవరానికి చెందినవాడేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతుని వివరాలు తెలిస్తే 9441238182 అన్న నంబర్‌కు సమాచారం తెలియజేయాలన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

విద్యార్థికి అభినందన


ప్రతిభా పురస్కారం అందుకుంటున్న విద్యార్థి వన్నూరు

ఆత్మకూరు: ఆత్మకూరు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి వన్నూరప్ప ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతులమీదుగా రూ.15వేలు నగదు అందుకోవడం అభినందనీయమని ప్రిన్సిపాల్ శంకరయ్య తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ కళాశాలలో ప్రతిభ కనబరిచిన హెచ్ఈసీ విద్యార్థి వన్నూరప్పను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకోవడంతో అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థిని కళాశాలలో శుక్రవారం అభినందించారు.

ముగ్గురు విద్యార్థుల డిబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ యూజీ కోర్సుల్లో నిర్వహిస్తున్న బీఎస్సీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో ఇద్దరు, కళ్యాణదుర్గంలో ఒకరు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా పట్టుబడినట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీ శారదా శృంగేరీ శంకర మఠంలో వెలసిన గణపతి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగాయి. మఠం మేనేజర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం సిద్ధి గణపతికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. అనంతరం వేదపండిత బృందం గణపతి హోమాన్ని, పూర్ణాహుతిని జరిపించారు.

సజావుగా ఉద్యోగుల బదిలీలు


బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీహెచ్ఎస్‌లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ తిప్పేంద్రనాయక్

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో శుక్రవారం జనరల్ డ్యూటీ అటెండెన్స్(క్లాస్ 4 ఉద్యోగులు/ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ/దోబీ)ల సాధారణ బదిలీల కౌన్సెలింగ్ సజావుగా సాగింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని 36 మంది ఉద్యోగులు బదిలీల్లో పాల్గొన్నారు. ఐదేళ్లు పూర్తయిన వారు 32 మంది, రెండేళ్లు పూర్తయిన వారు నలుగురికి బదిలీలు నిర్వహించారు. సీనియార్టీ ప్రాతిపదికన వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారు. పారదర్శకంగా బదిలీలను నిర్వహించినట్లు డీసీహెచ్ఎస్‌లు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ తిప్పేంద్ర నాయక్ పేర్కొన్నారు. శనివారం ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్స్‌కు బదిలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఏసీపీగా బాలాజీ బాధ్యతల స్వీకరణ


ఏసీపీ ఈ బాలాజీ

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన మేయర్ వసీం, కమిషనర్ రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన 1993 నుంచి 1996కు అనంతపురం మునిసిపాలిటీలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పని చేశారు. ఇటీవల సాధారణ బదిలీల్లో ఆయన విజయవాడ నుంచి నగరపాలక సంస్థకు బదిలీ అయిన విషయం విదితమే. నూతన ఏసీపీ బాలాజీకి టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్‌జాన్, దుర్గాంజలి తదితరులు అభినందనలు తెలిపారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు


లక్ష్మీనగర్‌లో మాట్లాడుతున్న నదీమ్


శ్రీనగర్ మసీదులో మేయర్ వసీం ఆధ్వర్యంలో..

- ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్

అనంతపురం సిటీ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముస్లింల ద్రోహి అని ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీమ్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం లక్ష్మీనగర్‌లోని హుస్సేనియా, కళ్యాణదుర్గం రోడ్డులోని ఫాతిమా మసీద్‌లో నిర్వహించిన 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమానికి వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్‌తో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో చంద్రబాబు ఒక్క ముస్లింకు కూడా మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించాడన్నారు. ముస్లింల ఎదుగుదలను విస్మరించి, రాజకీయంగా అణచిదొక్కినట్లు మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ ముస్లింల ఓట్ల కోసం కల్లబొల్లి మాటలు చెబుతూ, లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చి తమ జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి కాగా, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యతోనే ముస్లింల జీవితాల్లో వికాసం సాధ్యమని నమ్మి, ఉర్దూ విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ముస్లింల కోసం చిత్తశుద్ధితో పని చేస్తోంది వైఎస్ కుటుంబం మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, నాయకులు మహబూబ్ ఖాన్, వేముల నదీమ్, ముహీబ్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తులు, గిత్తులు పని చేయవ్ : మేయర్ వసీం

ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండోసారి అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని అనంతపురం మేయర్ వసీం ధీమా వ్యక్తం చేశారు. అనంతపురం శ్రీనగర్ కాలనీలోని మసీద్‌లో శుక్రవారం నిర్వహించిన 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో మేయర్ వసీం, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ పాల్గొన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా అనేక రకాల సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తూ, అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజల హృదయాల్లో నిలచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, ముతవల్లి, రఫీక్, ఇమామ్, అబ్దుల్ ముజీబ్, కమిటీ సభ్యులు సలీం, ఖాజా, ఖాదర్, మెహరాజ్, రహంతుల్లా, వలి, అమీర్‌బాషా, అన్వర్‌బాషా, నిషార్ తదితరులు పాల్గొన్నారు.

'పవన్ కళ్యాణ్‌కు అంత సీన్ లేదు'


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: 'దేశ చరిత్రలోనే ఆదర్శవంత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి ఎవరికీ లేదు.. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ పవన్ కళ్యాణ్ దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నాడని, ఆయనకు అంత సీన్ లేదని మేయర్ వసీం అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం విలేకరులతో మాట్లాడారు. వారాహీ వాహనంపై ప్రజల్లోకి వస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రెండుసార్లు తనకు ప్రజలు అవకాశం ఇవ్వాలని, ఇస్తే ప్రజలు న్యాయం చేస్తానని పవన్ కళ్యాణ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నిలకడలేని మనస్తత్వం ఉన్న ఆయన ప్రజలకేం మేలు చేస్తారని విమర్శించారు.

99శాతం హామీలు అమలు చేశారు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని మేయర్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించారంటూ సీఎంపై వ్యాఖ్యలు చేయడానికి పవన్‌కళ్యాణ్‌కు నోరెలా వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన తెచ్చారన్నారు. అధికార దాహం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గద్దె దించాలన్న కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న చంద్రబాబుతో పవన్‌కళ్యాణ్ జతకట్టి నీచరాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజల్లో విశ్వాసమున్న జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇస్హాక్ అహ్మద్, బాలాంజనేయులు, నాయకులు మధు, ఖాజా, కిశోర్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నగరపాలక సంస్థలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు మేయర్ వసీం తెలిపారు. శుక్రవారం రెండో రోడ్డులోని అర్బన్ పీహెచ్‌సీలో కిమ్స్–సవీర సౌజన్యంతో ఏర్పాటు చేసిన గుండె వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ ఇప్పటికే పలు సర్కిళ్లలోని కార్మికులకు హెల్త్ క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. రోజూ వేకువజామున, సాయంత్రపు వేళలో కార్మికులు పారిశుధ్య పనుల్లో నిమగ్నమై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. వారి ఆరోగ్యం కోసం హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికుడికీ 2 డీ ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ముందస్తుగా స్క్రీనింగ్ చేయడం ద్వారా భవిష్యత్‌లో ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు టీవీ చంద్రమోహన్ రెడ్డి, ఇస్హాక్, లాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం


పూజలందుకున్న సర్వేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని సర్వేశ్వరాలయంలో జరిగిన వార్షికోత్సవాలు శుక్రవారం కనులపండువగా ముగిశాయి. ఉదయం ప్రధాన అర్చకులు గురుమూర్తి నేతృత్వంలో వేదపండితులు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. వేదమంత్రోచ్ఛారణ, శివనామ స్మరణ నడుమ ఆదిదంపతుల పరిణయ వేడుకలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గొరవయ్యలు సంప్రదాయ నృత్యంతో మహాశివుడికి భక్తినీరాజనాలర్పించారు. ఉరవకొండ గవిమఠం పీఠాధిపతులు కరిరాజేంద్ర మహాస్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలనందించారు.

ఆకట్టుకుంటున్న మాత్రిక డిజైనర్స్ ఆషాఢం సేల్

అనంతపురం క్రైం: నగరంలోని మాసినేని గ్రాండ్‌లో మాత్రిక డిజైనర్స్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఆషాఢం సేల్ అందరినీ ఆకట్టుకుంటోంది. రెండ్రోజులుగా వ్యాపారం జోరుగా సాగుతోంది. మాత్రిక డిజైనర్స్ సీఈఓ ఉమామహంతి మాట్లాడుతూ అనంతపురం ప్రజలకు సరికొత్త డిజైన్లతో బెనారస్, కాటన్, టసర్ శారీస్, కుర్తీస్, లెహంగాస్, చుడీదార్స్‌ను ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. లెహంగాస్‌పై 50 శాతం వరకు, స్పెషల్ కౌంటర్స్‌లో 15 శాతం వరకు కొనుగోళ్లపై రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రిక డిజైనర్స్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయం వద్ద చలో విజయవాడ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల విషయంలో సానుకూలంగా స్పందించి పెండింగ్ క్లయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రాము, దుర్గ, రామదాసు, రంగ, విజయ్, వెంకటేశ్, బాషా పాల్గొన్నారు.

శ్రీ బాలాజీ నర్సింగ్ హోంకు క్లీన్‌చిట్

అనంతపురం క్రైం: నగరంలోని సంగమేశ్వర నగర్‌లోని శ్రీ బాలాజీ నర్సింగ్ హోంకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు క్లీన్‌చిట్ ఇచ్చారు. ఓ బాలింత మృతికి సంబంధించి కలెక్టర్ గౌతమి ఆదేశాలతో డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ బృందం శ్రీ బాలాజీ నర్సింగ్ హోంను సీజ్ చేసి విచారణకు ఆదేశించారు. రెండు వారాల క్రితం ప్రభుత్వ సర్వజనాస్పత్రి గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివశంకర్ నాయక్, అనస్తీషియా వైద్యుల బృందం విచారణ పూర్తి చేసి, నివేదికను ఆరోగ్యశాఖాధికారులకు సమర్పించారు. దీంతో పాటుగా ఆస్పత్రి రెన్యూవల్, ఫైర్ ఎన్‌ఓసీ తెచ్చుకోవడంతో ఆస్పత్రికి డీఎంహెచ్ఓ క్లీన్‌చిట్ ఇచ్చారని పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రి సీజ్‌ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి ఆస్పత్రిలో సేవలు కొనసాగుతాయని శ్రీ బాలాజీ నర్సింగ్ హోం నిర్వాహకులు తెలిపారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో గుంతకల్లు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఆగిపోయింది. ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. గుంతకల్లు డిపో బస్సు నగరంలోకి రాగానే బ్రేక్ డౌన్ అయ్యింది. మెకానిక్‌లు వచ్చి బస్సును మరమ్మతు చేశారు. బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా చూసుకోవాలని ఆర్టీసీ అధికారులకు ఎండీ ద్వారకా తిరుమల రావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన అధికారుల్లో మార్పురాలేదని విమర్శలు వ్యక్తమయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

జర్నలిస్టులకు అండగా ఉంటాం

- అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి


బ్యాటింగ్ చేస్తున్న డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జర్నలిస్టులకు అండగా ఉంటామని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో కొడిమి జర్నలిస్ట్ కాలనీలో ఆర్డీటీ డైరెక్టర్ మ్యాంచో ఫెర్రర్ సహకారంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పురపాలక శాఖ రీజినల్ డైరెక్టర్ మూర్తి, ఆర్డీటీ సిబ్బంది రాజశేఖర్‌రెడ్డి, జర్నలిస్ట్ సంఘాల నాయకులు వెంకటేశులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకుడు మచ్చారామలింగారెడ్డి పాల్గొన్నారు. డీఐజీ మాట్లాడుతూ కొడిమి జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధికి ఆర్డీటీ సహకారం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం అహుడా సహకారంతో ప్రభుత్వం నిర్మించిన పార్కులోని క్రికెట్ ప్రాక్టీస్ మ్యాట్‌పై డీఐజీ అమ్మిరెడ్డి బ్యాట్ పట్టి సందడి చేశారు. పురపాలక శాఖ రీజినల్ డైరెక్టర్ మూర్తి బౌలింగ్ చేయగా, డీఐజీ బ్యాటింగ్ చేశారు. అనంతరం కాలనీలో మొక్కలు నాటారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: నాడు–నేడు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కమిషనర్ రమణారెడ్డి ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం మొదటి రోడ్డు పొట్టి శ్రీరాములు స్కూల్‌లో అదనపు గదుల నిర్మాణాన్ని కమిషనర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 50వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేసిన పలు రోడ్లను కమిషనర్ పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ గురుశేఖర్ బాబు పార్కు అభివృద్ధి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించారు.

వేకువజామున విధుల్లో పాల్గొనాలి: పారిశుధ్య కార్యదర్శులు వేకువజామునే విధులకు హాజరుకావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పారిశుధ్య, ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం నుంచి యధావిధంగా విధులకు హాజరుకావాలన్నారు.

రీసర్వేతో కచ్చితమైన భూ కొలతలు


రీసర్వేపై ముక్తాపురంలో గ్రామసభ నిర్వహిస్తున్న సర్వేయర్, రెవెన్యూ అధికారులు

కనగానపల్లి: ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూ రీసర్వే–భూ రక్ష కార్యక్రమం ద్వారా భూములకు కచ్చితమైన కొలతలు నిర్ధారణ చేయబడతాయని సర్వేయర్ స్టీఫెన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తాపురంలో భూసర్వే కార్యక్రమంపై రెవెన్యూ, సర్వే అధికారులు స్థానిక రైతులతో గ్రామసభ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ముక్తాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని పర్వతదేవపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి, కొండ్రెడ్డిబాయి గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామన్నారు. సర్వే సమయంలో భూ హక్కుదారులకు సమాచారం అందించి, వారు ఇచ్చిన హక్కు పత్రాల మేరకు వివరాలు నమోదు చేస్తామన్నారు. సర్వేను రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ల వరుస సంఖ్య ప్రకారం మొదటి నుంచి చివరి దాకా చేసుకొంటుపోతామన్నారు. సమావేశంలో వీఆర్వో చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, గ్రామ సర్వేయర్ తులసి, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విధులపై నిర్లక్ష్యం


ఉదయం 11 గంటలు దాటినా ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ కుర్చీ

అనంతపురం రూరల్: బీసీ సంక్షేమశాఖ కార్యాలయ సిబ్బంది విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యాలయాలు, వసతి గృహాలు తిరిగి ప్రారంభమయ్యాయి. స్కాలర్‌షిప్‌లతో పాటు వివిధ సమస్యలతో పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యాలయానికి వస్తుంటారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వెనుదిరగాల్సి వస్తోంది. ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది విధులకు హాజరుకావడంలేదు. జిల్లా స్థాయి అధికారితోపాటు సూపరింటెండెంట్ కూడా అందుబాటులో లేరు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే విధులకు హాజరయ్యారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బుక్కరాయసముద్రం: రైతులు పంటలు సాగు చేసే సమయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఏరువాక కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులతో ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలను కోసిన తర్వాత పొలాల్లో తేమ ఉన్నప్పుడు దుక్కులు చేసుకోవాలన్నారు. దుక్కిలోకి 4–5 టన్నుల సేంద్రియ ఎరువులను వేసుకోవాలన్నారు. వేరుశనగ విత్తనం విత్తే సమయంలో భాస్వరం, పొటాష్, ఎరువులను వేసుకోవాలన్నారు. వర్షాధార పంటలకు ఎకరాకు 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలన్నారు. నీటి పారుదల పంటలకు ఎకరాకు 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, ఆఖరి దుక్కిలో వేసుకోవాలని సూచించారు. విత్తే సమయంలో 18 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. 30 రోజుల తరువాత 9 కిలోల యూరియాను వేసుకోవాలన్నారు. రిలయన్స్ రైతు ఫౌండేషన్ మేనేజర్ ప్రకాష్ మాట్లాడుతూ రైతులు మరింత సమాచారం తెలుసుకునేందుకు రిలయన్స్ ఫౌండేషన్ వారి టోల్‌ఫ్రీ నెంబర్– 18004198800 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుంతకల్లు: పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలోని రైల్వే మోరీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..పాతూరుకు చెందిన నాగరాజు, అతని అక్క శ్యామల బైక్‌పై కసాపురం వైపు వెళ్తుండగా కసాపురం రైల్వే మోరీ వద్ద అటువైపు నుంచి వస్తున్న స్కార్పియో వాహనం ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాల్యాయి. వెంటనే గాయపడిన వారిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు వారిని అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలో శుక్రవారం వేకువజామున లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల.. డ్రైవర్ జ్ఞానేశ్వర్ అనంతపురం నుంచి లోడ్ తీసుకొని కర్నూలు జిల్లా ఆదోని బయలుదేరాడు. అయితే జొన్నగిరి శివారులో చెరువు కట్ట వద్ద వేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలో బోల్తా పడింది. లారీలో ఇరుక్కున్న డ్రైవర్ జ్ఞానేశ్వర్‌ను 108 సిబ్బంది శ్రమించి బయటకు తీసి గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఉమ్మడి జిల్లావాసులేగాక కర్ణాటక ప్రాంతవాసులు పూజల్లో పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు


భగత్‌సింగ్ నగరపాలక పాఠశాలలో విద్యాకానుక అందిస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురాం


విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందిస్తున్న సర్పంచ్ గౌతమి


విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లను అందిస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు తీసుకొచ్చి, పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ విద్యనందించేలా చర్యలు తీసుకున్నారని మాజీ మేయర్ రాగే పరుశురాం పేర్కొన్నారు. శుక్రవారం ఏడో డివిజన్ ఉమానగర్‌లోని భగత్‌సింగ్ పాఠశాలలోని విద్యార్థులకు ఆయన విద్యా కానుక అందించారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండి నాగమణి, హెచ్ఎం సరస్వతి, విద్యా విభాగ కార్యదర్శి ఫైరోజ్, డివిజన్ కన్వీనర్ నజీర్, వెంకటరాముడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక వరం

ఆత్మకూరు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని సనప సర్పంచ్ గౌతమి తెలిపారు. శుక్రవారం మండలంలోని సనప ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకోవాలి

విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని హెచ్ఎం శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ప్రభుత్వం ఇచ్చే నగదు, మెడల్, సర్టిఫికెట్లు అందించారు. పాఠశాలల్లో మొదటి స్థానంలో వచ్చిన జోషిక 568 మార్కులు సాధించినందుకు రూ.3వేలు, నజనీన్ 559 మార్కులు సాధించినందుకు రూ.2 వేలు, ఆదర్శ్ 550 మార్కులు సాధించినందుకు వెయ్యి నగదు, సర్టిఫికెట్లను కూడా అందించారు.